# అప్పగింతలు

మామూలుగా ప్రతీ సంవత్సరం లాగానే పిల్లలకు పరీక్షలు అయిపోయాయి. వేసవి శెలవులు ఇచ్చేశారు. మంచి ఎండలు కాస్తున్నాయి. సుబ్బారావు ఎలాగో ఆఫీసుకు వెళ్ళి వస్తున్నాడు.

ప్రతి సంవత్సరం లాగానే సుబ్బారావు భార్య తన పిల్లల్ని వెంటబెట్టుకుని తన పుట్టింటికి బయలుదేరింది.

తనకు శెలవులు వుండవు కాబట్టి పాపం సుబ్బారావు ప్రతీ సంవత్సరం వేసవి శెలవుల్లో వంట చేసుకుని తిప్పలు పడుతున్నాడు.

ఆ రోజు బస్‌స్టాండ్‌కి భార్యా పిల్లల్ని బస్ ఎక్కించడానికి వచ్చేడు. బస్సు వచ్చింది. భార్యా పిల్లలు ఎక్కి కూర్చున్నారు. కండక్టరూ, డ్రైవరూ ఇంకా రాలేదు.

''పెద్ద దానికి మామిడి పళ్ళు తింటే అరగదు. దానికి అవి ఇష్టంకదావని ఒకటే పెట్టమాక.''

''రెండవ వాడికి హార్లిక్స్ లేకపోతే వుండలేదు. నీ దగ్గర వున్న డబ్బులతో హార్లిక్స్ అయిపోగానే కొనేసెయ్.''

''చంటాడు ఎండలో తిరుగుతాడు జాగ్రత్త. వాడు నీమాట వినడు. నన్ను కావాలంటాడు అస్తమానూ. ఎలాగో బెంగపెట్టుకోకుండా చూడు. ఒకవేళ బెంగపెట్టుకుని జ్వరం వస్తే ట్రంక్‌కాల్ చెయ్యి. వెంటనే వచ్చేస్తాను.''



''నువ్వు నీరసంగా వున్నావ్. నేను కొనిచ్చిన మాత్రలు రోజూ శ్రద్ధగా వేసుకో. మీ ఇంట్లో అందరితో పోదిపెట్టుకుని కూర్చోకుండా రాత్రిళ్ళు పెందరాళే నిద్రపో''

సుబ్బారావు తొంభై నిముషాలు టేప్‌రికార్డర్ లాగా ఒకటే వాగుతున్నాడు.

అతని మాటల్నీ, తమ ఇద్దర్నీ బస్‌లో అందరూ చూస్తున్న సంగతి సుమకి విసుగుగా వుంది.

''సరేలెండి. మీరు జాగ్రత్తగా వండుకుని తినండి'' అంది విసుగ్గా.

ఈలోగా బస్ కదిలింది.

భార్య పిల్లలు వెళ్ళి నాలుగు రోజులైంది. రోజూ ఉత్తరం కోసం ఎదురు చూస్తున్నాడు.

ఆరోజు భార్య దగ్గర నుండి ఉత్తరం వచ్చింది.

''శ్రీవారికి

నమస్కారములు.

నేను పిల్లలూ క్షేమంగా చేరాము. మీరు క్షేమమని తలుస్తాను.

మొన్న బస్‌స్టాండ్‌లో చెప్పడంమరిచిపోయాను. ఎదురింటి పిన్నిగారు వాళ్ళ దొడ్లో మామిడి కాయలు ఇస్తే తరిగి ఉప్పులో వేశాను. వాటిని నాలుగు రోజులు ఎండపెట్టి మాగాయి కలిపి పోపు పెట్టండి.

చిన్నఆవకాయ ఒకసారి కలిపి ఎక్కువ తక్కువైతే సరి చెయ్యండి. ఇవన్నీ మడికట్టుకుని చెయ్యండి.

రాత్రుళ్ళు దొడ్డితలుపులు జాగ్రత్తగా వెయ్యండి. బీరువా తాళం రోజూ రాత్రుళ్ళు వేసుకుని పడుకోండి. అవసరమైతే కాని బీరువా తాళం తియ్యకండి.

పాలు లెక్క రాయండి. లేకపోతే ఎక్కువ పోశానంటుంది పాలమ్మాయి.

నేను వచ్చేలోగా అప్పులు చెయ్యకండి.'' ఇలావుంది ఆమె ఉత్తరం.

ఉత్తరం ఉండచుట్టి కిందపారేసి ''ఛీ ఆడాళ్ళు'' అనుకుని మళ్ళీ తను చేయాల్సిన పనులు గుర్తుకు వచ్చి ఆ ఉండ బల్లమీద పెట్టుకున్నాడు పాపం సుబ్బారావు.

— కె.బి. కృష్ణ



## చోరకళ

జైలులో ఇద్దరు ఖైదీల సంభాషణ.

మొదటి ఖైదీ: నిన్ను ఏ నేరం కింద అరెస్ట్ చేశారు.

రెండవ ఖైదీ: 64 కళలలో ఒక కళ ప్రదర్శించినందుకు.

మొదటి ఖైదీ: ఎంత అన్యాయం నీలాంటి కళాకారుడ్ని శిక్షించడం. ఇంతకీ ఏం కళ.

రెండవ ఖైదీ: చోరకళ.

— టి.రామకృష్ణ, తెనాలి.

## నిరుద్యోగ నిర్మూలన

ఒళ్ళంతా కట్లతో హాస్పటల్‌లో ఉన్న రాజకీయ నాయకుడిని ''ఏమిటి ఈ దెబ్బలు ఎలా తగిలినయ్యి'' అడిగాడు స్నేహితుడు.

''నిన్న ఉపన్యాసంలో నిరుద్యోగం నిర్మూలిస్తాను అనబోయి పొరపాటున నిరుద్యోగుల్ని నిర్మూలిస్తాను అన్నాను అంతే'' వాపోయాడు రాజకీయ నాయకుడు.

— టి.రామకృష్ణ, తెనాలి.

## కుటుంబ నియంత్రణ

టీచర్: ఏరా రాము నీకు ఎన్ని ఎక్కాలు వచ్చు అంటే రెండు లేక మూడు అంటున్నావు. ఇంతకీ మీ నాన్న ఏమి చేస్తుంటాడు.

రాము: కుటుంబ నియంత్రణ అధికారి అండీ.

— టి.రామకృష్ణ, తెనాలి.